RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in




సంపుటి -13 సంచిక - 485 | 04,అక్టోబర్ ఆదివారం 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--

### పిల్లల ఆన్‌లైన్ భద్రతకు

# ప్రత్యేక ఫ్రేమ్‌వర్క్

## : రేవంత్ రెడ్డి



డిజిటల్ యుగంలో సైబర్ నేరాల నుంచి పిల్లలకు రక్షణ కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక చర్యలకు శ్రీకారం చుట్టింది. పిల్లల ఆన్‌లైన్ భద్రత కోసం ఒక సమగ్ర ఫ్రేమ్‌వర్క్‌ను వెంటనే రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో జరిగిన నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నల్సా) సౌత్ జోన్ రీజనల్ కాన్ఫరెన్స్‌లో ఆయన ఈ ఆదేశాలు జారీ చేశారు.ఆన్‌లైన్‌లో పిల్లలు ఎక్కువ సమయం గడుపుతున్నారని, అక్కడ ఎదురయ్యే ప్రమాదాలపై వారికి సరైన అవగాహన ఉండటం లేదని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, తెలంగాణ హైకోర్టు, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థతో సంప్రదింపులు జరిపి ఈ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించాలని సూచించారు. మహిళలు, పిల్లల సంరక్షణే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు. ఈ ఫ్రేమ్‌వర్క్ ద్వారా న్యాయ సేవలను రాష్ట్రంలోని ప్రతీ గ్రామానికి విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా తల్లిదండ్రులకు సీఎం కీలక సూచనలు చేశారు. పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలను గమనించేటప్పుడు తీర్పులిచ్చేలా కాకుండా ఆసక్తిగా, స్నేహపూర్వకంగా వ్యవహరించాలని అన్నారు. "క్యూరియస్‌గా ఉండండి, జడ్జ్‌మెంటల్‌గా కాదు" అని ఆయన హితవు పలికారు. సైబర్ క్రైమ్ ఫిర్యాదుల కోసం 1930, చైల్డ్ హెల్ప్‌లైన్ కోసం 1098 నంబర్లను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఇప్పటికే భరోసా సెంటర్లు, దేశంలోనే మొదటి చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టు, సైబర్‌హర్ యాప్ వంటివి సమర్థంగా పనిచేస్తున్నాయని సీఎం గుర్తుచేశారు.



## అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దు..

### చివరి నిమిషంలో కీలక నిర్ణయం!

కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దయింది. ఒక రోజు పర్యటన నిమిత్తం రేపు ఆయన రాష్ట్రానికి రావాల్సి ఉండగా.. చివరి నిమిషంలో కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నారు. దానికి గల కారణాలేంటో అధికారికంగా వెల్లడికాలేదు.షెడ్యూల్ ప్రకారం అమిత్ షా నేటి రాత్రి 9 గంటలకు ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని, లోక్‌భవన్‌లో బస చేయాల్సి ఉంది. ఆదివారం ఉదయం మెదక్, కరీంనగర్ జిల్లాల్లో ఆయన పర్యటిస్తారని.. పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడంతో పాటు ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారని షెడ్యూల్ లో పేర్కొన్నారు.హోంమంత్రి పర్యటన కోసం మెదక్, కరీంనగర్ జిల్లాల యంత్రాంగం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. పోలీసులు కూడా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. అయితే పర్యటన రద్దుకు గల కారణం మాత్రం ఇంకా స్పష్టంగా తెలియలేదు.ఢిల్లీలో అత్యవసర పరిణామాలు లేదా ఇతర అనివార్య కారణాల వల్లే పర్యటన రద్దయి ఉండొచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పర్యటన రద్దుతో బీజేపీ శ్రేణుల్లో నిరాశ నెలకొంది. అమిత్ షా తెలంగాణకు ఎప్పుడు వస్తారనే విషయాన్ని త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

### దిగ్గజ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు

## కన్నుమూత

- చెన్నైలో తుదిశ్వాస విడిచిన సింగీతం శ్రీనివాసరావు (94)
- ఆరు దశాబ్దాల కెరీర్‌లో తెలుగు, తమిళ, హిందీ భాషల్లో 60కి పైగా చిత్రాలకు దర్శకత్వం
- పుష్పక విమానం, ఆదిత్య 369, మయూరి వంటి ప్రయోగాత్మక చిత్రాలతో చరిత్ర సృష్టించిన వైనం
- 94 ఏళ్ల వయసులోనూ 'సింగ్ గీతం' అనే చిత్రానికి దర్శకత్వం వహించి రికార్డు
- ఆయన మృతికి సినీ, రాజకీయ ప్రముఖుల సంతాపం



### రాష్ట్రంలో కాంగ్రెస్

# శకం ముగిసింది

## : హరీశ్ రావు



మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలో పలువురు కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన నేతలకు మాజీ మంత్రి హరీశ్ రావు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ శకం ముగిసిందని అన్నారు. సాధారణంగా ప్రతిపక్షం నుంచి అధికార పక్షంలోకి వలసలు ఉంటాయని, కానీ ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉన్నప్పటికీ అధికార కాంగ్రెస్ నుంచి నేతలు ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌లోకి రావడం అసాధారణమని వ్యాఖ్యానించారు. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో కనీసం రోడ్ల మరమ్మతులు కూడా చేపట్టలేదని, రోడ్లు గుంతలమయంగా మారి ప్రమాదాలకు కారణమవుతున్నాయని ఆయన విమర్శించారు.అభివృద్ధి పనుల వైఫల్యం కారణంగా ప్రజలు కాంగ్రెస్ నేతలను నిలదీస్తున్నారని, ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్న పార్టీలో ఉండటం కంటే కేసీఆర్ నాయకత్వంలో పనిచేయడమే మేలని భావించి కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని హరీశ్ రావు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చెబుతున్న 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టును ఆయన 'ఫ్యూచర్ లేని సిటీ'గా ఎద్దేవా చేశారు. ఇప్పటికే ఉన్న నివాస ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కల్పించకుండా, ఇలాంటి ప్రాజెక్టులు చేపట్టడం ఏంటని ఆయన మండిపడ్డారు.

### నా పోటీ హుజూర్‌నగర్ నుంచే..

## వదంతులు నమ్మొద్దు

### : మంత్రి ఉత్తమ్



తెలంగాణ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తన రాజకీయ భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలకు తెరదించారు. వచ్చే ఎన్నికల్లో తాను హుజూర్‌నగర్ నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానని ఆయన స్పష్టం చేశారు. డీలిమిటేషన్ తర్వాత తుంగతుర్తికి మారవచ్చంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు. ప్రస్తుతం ఉత్తమ్ కుమార్ రెడ్డి హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.ఈరోజు హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఉత్తమ్ కుమార్ రెడ్డి... తన నియోజకవర్గం మార్పుపై వస్తున్న వదంతులను ఎవరూ నమ్మవద్దని కోరారు. తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని తన స్వగ్రామం తాటిపాములలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, అంతమాత్రాన అక్కడి నుంచి పోటీ చేస్తాననడం అవాస్తవమని తెలిపారు.

ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతులపై కూడా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రాజెక్టులోని మూడు బ్యారేజీల పునరుద్ధరణలో డిజైన్‌కు సంబంధించిన లోపాలుంటే, ఆ ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. అయితే, నిర్మాణ ఏజెన్సీల పరిధిలోకి వచ్చే సమస్యలు ఏవైనా ఉంటే, వాటిని ఆయా సంస్థలే సొంత ఖర్చుతో సరిచేయాల్సి ఉంటుందని ఆయన వివరించారు.

### నాలుగోసారి అధికారంలోకి వచ్చేందుకే

## ఓట్ల తొలగింపు : వీహెచ్



నాలుగోసారి అధికారంలోకి వచ్చేందుకే బీజేపీ, ఆర్ఎస్ఎస్ కలిసి ఓటర్ల జాబితా నుంచి ఓట్లను తొలగించే కుట్రకు పాల్పడుతున్నాయని కాంగ్రెస్ సీనియర్ నేత, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు తీవ్ర ఆరోపణలు చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియ ద్వారా ఈ కుట్రను అమలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నికల సంఘాన్ని (ఈసీ) తన గుప్పిట్లో పెట్టుకుందని ఆరోపించారు.ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ద్వారా పెద్ద ఎత్తున ఓట్లను తొలగింపజేస్తున్నారని వీహెచ్ అన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని కాలరాసి, కొత్త రాజ్యాంగాన్ని అమలు చేయాలనే దురుద్దేశంతోనే ఇదంతా చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. దేశవ్యాప్తంగా జనాభా గణన జరుగుతున్నా, అందులో ఓబీసీల ప్రస్తావన లేదని దుయ్యబట్టారు.ఈ అంశంపై పోరాటాన్ని ఉధృతం చేస్తామని వీహెచ్ ప్రకటించారు. రేపు శంషాబాద్‌లో ఓబీసీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ నేతృత్వంలో జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహిస్తామన్నారు. అనంతరం రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపట్టి, 'ఓబీసీ గర్జన'ను ఢిల్లీ వరకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. న్యాయం కోసం పోరాడేందుకు ఇదే చివరి అవకాశమని, రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరుస్తూ కేంద్రం ఓబీసీ గణన చేపట్టేవరకు పోరాటం కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు.



## ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్ కొనుగోలు చేసి ప్రయాణించిన తెలంగాణ మంత్రులు

తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క పలువురు మంత్రులతో కలిసి ఈరోజు మెట్రో రైలు, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. ఈ సందర్భంగా భట్టివిక్రమార్క మాట్లాడుతూ, ప్రజలకు ప్రభుత్వ రవాణాను మరింత సులభతరం చేయడం కోసం ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్ తీసుకొచ్చినట్లు తెలిపారు. భవిష్యత్తులో దీనిని ఆటోలు, క్యాబ్‌లకు అనుసంధానించే ఆలోచనలో ఉన్నట్లు చెప్పారు. శనివారం డే పాస్‌తో మంత్రులతో కలిసి ఆయన ఆర్టీసీ బస్సులో బేగంపేట మెట్రో స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్టు వరకు మెట్రో రైలులో ప్రయాణించారు. ఈ సందర్భంగా తనతో పాటు ప్రయాణించిన మంత్రులకు, భట్టి విక్రమార్క కాంబో పాస్ కొనుగోలు చేశారు.హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించడం, ప్రజా రవాణా వైపు ప్రయాణికులను ఆకర్షితులను చేయడం కోసం ఈ పాస్ తీసుకొచ్చినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. ప్రస్తుతం వీటిని ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నామని వెల్లడించారు. ప్రజలపై ఆర్థిక భారం పడకుండా చూస్తామని తెలిపారు. కాంబో పాస్‌పై ప్రయాణించిన మంత్రుల్లో వివేక్, అజారుద్దీన్ తదితరులు ఉన్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
తెలుగు దిన పత్రిక
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
hyderabadestate.co.in
04,అక్టోబర్ ఆదివారం 2026

# నందు పల్లి గ్రామంలో ఉర్సు ఉత్సవాలు

**( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి అక్టోబర్ 03:)**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నందుపల్లి గ్రామంలో హజ్రత్ సయ్యదిన మహబూబ్ సుభాని రహమతుల్లా అలై ఉర్స్ ఇ షరీఫ్ గ్రంధోత్సవం ఘనంగా నిర్వహించారు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ప్రజలందరూ అందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో సిరిసంపదలతో పిల్లాపాపలతో ఎల్లప్పుడు సంతోషంగా ఉండాలని ప్రత్యేక దువా చేశారు ఈ కార్యక్రమంలో నందుపల్లి గ్రామ సర్పంచ్ దేశపాగ నరసింహ, ఉప సర్పంచ్ ముస్లిం సంక్షేమ సంఘం అధ్యక్షులు షేక్ ఎజాస్, గ్రామపంచాయతీ సభ్యులు దేశపాక సంతోష్, మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షులు షేక్ హాజీ బాబా, ఉపాధ్యక్షులు మొహమ్మద్ సాదిక్, షేక్ హబీబ్, ప్రధాన కార్యదర్శి షేక్ ఖాజా పాషా, కోశాధికారి మొహమ్మద్ ఖయ్యూం ఖాన్, కమిటీ సభ్యులు మొహమ్మద్ ఇస్మాయిల్ , షేక్ ఖాలీల్, మాజీ ఉప సర్పంచ్ మహమ్మద్ ఉస్మాన్,



గ్రామ పెద్దలు షేక్ అబ్దుల్ కరీం, సయ్యద్ అలీ, మహమ్మద్ అజీజ్, షేక్ సాబీర్, మహేశ్వరం ముస్లిం సొసైటీ మండల కార్యదర్శి మొహమ్మద్ జలాలుద్దీన్, సభ్యులు మొహమ్మద్ ఆరిఫ్, నందుపల్లి గ్రామ యువకులు షేక్ గౌస్ పాషా, సైఫ్, ఫయాజ్, అంజత్, మోసిన్, షరీఫ్, అన్వర్, తదితరులు పాల్గొన్నారు.

# శంషాబాద్‌లో జరిగే 'ఓబీసీ సింహగర్జన' సభను చారిత్రాత్మక విజయవంతం చేయాలి

## : రంగారెడ్డి డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి





**హైదరాబాద్ ఇస్తే సంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి అక్టోబర్ 3**

రంగారెడ్డి జిల్లా, రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని శంషాబాద్ – గొల్లపల్లి రోడ్డులో రేపు నిర్వహించనున్న ప్రతిష్ఠాత్మక 'ఓబీసీ సింహగర్జన' బహిరంగ సభా స్థలాన్ని రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి గారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, టీపీసీసీ ఓబీసీ ఛైర్మన్ మరియు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితరులు సభా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సభా ప్రాంగణంలో వేదిక, తరలివచ్చే ప్రజలకు సరిపడా వసతులు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లపై అధికారులతో మరియు నాయకులతో సమీక్ష నిర్వహించి తగిన సూచనలు అందజేశారు. బీసీ, బడుగు, బలహీన వర్గాల హక్కుల సాధన, రాజకీయ మరియు సామాజిక ప్రాధాన్యతను చాటిచెప్పేందుకు ఈ మహాసభ వేదిక కానుందని నాయకులు తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ శ్రేణులు, ఓబీసీ నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ సభను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. బడుగు వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా తలపెట్టిన ఈ ఓబీసీ సింహగర్జన సభను అందరి సమైక్య కృషితో విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు.

# కష్టకాలంలో అండగా SSC 200203 మిత్రబృందం..

## ఆంధ్రజ్యోతి రిపోర్టర్ కుటుంబానికి చేయూత

హన్మకొండ: కష్టకాలంలో తమ మిత్రులకు, వారి కుటుంబాలకు అండగా నిలుస్తూ రాజ 200203 మిత్రబృందం ఆదర్శంగా నిలుస్తోంది. ఇందులో భాగంగా హన్మకొండలోని ఆంధ్రజ్యోతి రిపోర్టర్ కురిమిల్ల శ్యామ్ కుటుంబాన్ని మిత్రబృందం సభ్యులు పరామర్శించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఆత్మీయంగా పలకరించి వారి పరిస్థితులను తెలుసుకున్నారు. అనంతరం మిత్రబృందం తరఫున రూ.15,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

మిత్రబృందంలోని సభ్యులు ఎవరైనా ఆపదలో ఉన్నా, వారి కుటుంబాలకు క్రమం తప్పకుండా తమవంతు సహాయం అందిస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్నారు. మిత్రత్వం అంటే కేవలం కలుసుకోవడం మాత్రమే కాకుండా.. కష్టసుఖాల్లో ఒకరికొకరు అండగా నిలవడమేనని నిరూపిస్తూ రాజ 200203 మిత్రబృందం కొనసాగిస్తున్న సేవా కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఈ సందర్భంగా మిత్రబృందం సభ్యులను పలువురు అభినందించారు.



# సాహిత్య, సామాజిక సేవకు అరుదైన గౌరవం

## రాణి నల్లమోతుకు గౌరవ డాక్టరేట్

## సేవా మార్గంలో విశిష్ట గుర్తింపు

## సీతాస్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ రాణి నల్లమోతుకు డాక్టరేట్

## సామాజిక సేవకు దక్కిన ప్రతిష్ఠాత్మక గౌరవం.

**హైదరాబాద్ అక్టోబర్ 03:**

సాహిత్య, సామాజిక సేవా రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేస్తున్న సీతాస్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ రాణి నల్లమోతుకు అరుదైన గౌరవం దక్కింది. సేవా రంగంలో ఆమె చేస్తున్న విశిష్ట కృషికి గుర్తింపుగా వెబ్బిక్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో అక్టోబర్ 2న ఆమెకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు.

విశిష్ట సేవలకు గుర్తింపు సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు సేవలందిస్తున్న సీతాస్ చారిటబుల్ ట్రస్ట్. సాహిత్య, సామాజిక సేవా రంగాల్లో రాణి నల్లమోతు విశేష కృషి.సేవా కార్యక్రమాల ద్వారా సమాజంలోని వివిధ వర్గాలకు అండగా నిలుస్తున్న సీతాస్.

ప్రజా సంక్షేమం, సామాజిక అభివృద్ధి కోసం నిరంతరం కార్యక్రమాల నిర్వహణ. ఆమె సేవలను గుర్తించిన వెబ్బిక్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌తో సత్కారం.ఈ గౌరవం సీతాస్ చారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమాలకు మరింత ప్రోత్సాహాన్ని అందించనుంది.ఈ సందర్భంగా రాణి నల్లమోతు మాట్లాడుతూ, తన సేవలను గుర్తించి గౌరవ డాక్టరేట్ అందించిన వెబ్బిక్ యూనివర్సిటీకి కృతజ్ఞతలు




తెలిపారు. ఈ గౌరవం తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో కూడా సాహిత్య, సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తానని పేర్కొన్నారు.

# హిందీ భాష ప్రత్యేకతపై విస్తృత ఉపన్యాసం




**సిద్దిపేట, అక్టోబర్ 3, హైదరాబాద్ ఎస్టేట్:**

ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వయం ప్రతిపత్తి, సిద్దిపేటలో కళాశాల ప్రిన్సిపాల్ ఆదేశాల మేరకు హిందీ విభాగం ఆధ్వర్యంలో హిందీ భాష, ప్రాచీన సంస్కృతిపై విస్తృత ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వయం ప్రతిపత్తి, బిచ్కుందకు చెందిన హిందీ సహాయ ఆచార్యులు డా. జి. రమేష్‌బాబు హాజరై హిందీ భాష ప్రత్యేకత, ప్రాముఖ్యతతో పాటు భారత ప్రాచీన సంస్కృతి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో హిందీ విభాగాధిపతి డా. జి. లీలావతి, హిందీ సహాయ ఆచార్యులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలంగాణలో ఆటో చార్జీల పెంపు..

## ఇక మీటర్ లెక్క ఇదే



హైదరాబాద్ స్టేట్ ప్రతినిధి ఇరిగి అశోక్ రాష్ట్రంలో ఆటో రిక్షా ప్రయాణ చార్జీల సవరణకు సంబంధించి నూతన నిబంధనలు రుసుముల వివరాలను ప్రభుత్వం సవరించింది. ప్రయాణికులపై పడే భారాన్ని ఆటో డ్రైవర్ల నిర్వహణ వ్యాయాన్ని పరిగణనలోకి తీసుకొని కొత్త విధానాన్ని ఖరారు చేశారు. నూతన నిబంధనల ప్రకారం తొలి 1.6 కిలోమీటర్ల ప్రయాణానికి కనీస చార్జిగా రూపాయలు.30 నిర్ణయించారు. ఆ తర్వాత ప్రయాణించే ప్రతి అదనపు కిలోమీటర్ కు రూపాయలు 14 చొప్పున వసూలు చేయనున్నారు. ఇక ప్రయాణంలో ట్రాఫిక్ లేదా ఇతర కారణాల వల్ల వాహనం నిలిచిపోయినప్పుడు వర్తించే వెయిటింగ్ చార్జీలను నిమిషానికి 75 పైసలుగా నిర్ణయించారు.

# మృతుల కుటుంబాలకు మానవతా సాయం

## - అంత్యక్రియల ఖర్చుల కోసం రూ.10 వేల ఆర్థిక సహాయం

**గీసుకొండ, అక్టోబర్ 3, హైదరాబాద్ ఎస్టేట్:**





అనారోగ్యంతో మృతి చెందిన ఇద్దరు పేద కుటుంబాలకు చెందిన వారికి అంత్యక్రియల ఖర్చుల కోసం ప్రముఖ సామాజిక సేవకుడు, రిటైర్డ్ స్టేట్ బ్యాంక్ మేనేజర్ పెగళ్లపాటి లక్ష్మీనారాయణ ఆర్థిక సాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. గీసుకొండ మండల కేంద్రానికి చెందిన కోట సమ్మయ్య, పసుల పోచయ్య మృతిచెందడంతో వారి కుటుంబాల పరిస్థితిని తెలుసుకున్న లక్ష్మీనారాయణ స్పందించి రూ.10 వేల సహాయాన్ని అందించారు. ఆయన పంపిన నగదును కర్ణకంటి రామ్మూర్తి మృతుల కుటుంబ సభ్యులకు చెరో రూ.5 వేల చొప్పున అందజేశారు. కష్టకాలంలో కుటుంబాలకు అండగా నిలిచిన లక్ష్మీనారాయణకు పలువురు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఉపసర్పంచ్ కోట ప్రమోద్, నాగరాజు, నాయకులు డా. తుప్పరి నరసింహస్వామి, పసుల రాజేందర్, సంపత్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు చంద్రబాబు మరోసారి వెన్నుపోటు పొడిచారు: బొత్స



ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు బీసీలకు మరోసారి వెన్నుపోటు పొడిచారని వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ తీవ్ర విమర్శలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను హైకోర్టు రద్దు చేసిన నేపథ్యంలో ఆయన స్పందించారు. ఈ జీవో న్యాయపరంగా నిలవదని తెలిసినా, కేవలం రాజకీయ లబ్ధి కోసమే చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారని మండిపడ్డారు."రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని సుప్రీంకోర్టు గతంలోనే స్పష్టంగా తీర్పు ఇచ్చింది. ఈ విషయం తెలిసి కూడా చంద్రబాబు బీసీలను మోసం చేసేందుకు ఈ జీవో ఇచ్చారు. ఇప్పుడు హైకోర్టు కొట్టేయడంతో సుప్రీంకోర్టుకు వెళతానని చెప్పడం బీసీలను మరోసారి మభ్యపెట్టడమే" అని బొత్స అన్నారు. ప్రభుత్వానికి బీసీల పట్ల నిజంగా చిత్తశుద్ధి ఉంటే, పార్లమెంటులో రాజ్యాంగ సవరణ కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు.బీసీ రిజర్వేషన్లను వైసీపీ అడ్డుకుంటోందని టీడీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని బొత్స మండిపడ్డారు. వెన్నుపోటు పార్టీలో ఉన్న బీసీ నాయకులు ఇప్పటికైనా చంద్రబాబు మోసాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేయడానికి బీసీ రిజర్వేషన్ల అంశాన్ని సాకుగా చూపవద్దని హితవు పలికారు. బీసీలకు చట్టబద్ధంగా రిజర్వేషన్లు దక్కేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరించాలని ఆయన స్పష్టం చేశారు.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
04,అక్టోబర్ ఆదివారం 2026

## విశిష్ట సేవా పతక గ్రహీత షేక్ అబ్దుల్ సమద్‌కి జీవీఆర్ కరాటే అకాడమీ ఘన సన్మానం



హైదరాబాద్, అక్టోబర్ 03:
ప్రెసిడెంట్ పోలీస్ మెడల్ ఫర్ డిస్టింగ్విష్డ్ సర్వీస్ (రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం) అందుకున్న శ్రీ షేక్ అబ్దుల్ సమద్‌ను జీవీఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. షేక్ అబ్దుల్ సమద్ సిఆర్‌పిఎఫ్ మరియు నేషనల్ పోలీస్ అకాడమీలో దాదాపు 41 సంవత్సరాల పాటు విశిష్ట సేవలు అందించారు. 1985లో కానిస్టేబుల్‌గా తన సేవా ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన, క్రమశిక్షణ, అంకితభావం మరియు కృషితో ఇన్‌స్పెక్టర్, డ్రిల్ ఇన్‌స్ట్రక్టర్ స్థాయికి ఎదిగారు. తన సేవా కాలంలో ఐపిఎస్ ప్రొబేషనరీ అధికారులు, నేరుగా నియామకమైన సబ్–ఇన్‌స్పెక్టర్లు మరియు అనేక మంది పోలీసు సిబ్బందికి ఆదర్శవంతమైన శిక్షణ అందించారు. పంజాబ్, అస్సాం, జమ్మూ–కాశ్మీర్ మరియు త్రిపుర వంటి సమస్యాత్మక ప్రాంతాల్లో కూడా ఆయన సేవలు అందించారు. శారీరక శిక్షణ, డ్రిల్, మార్షల్ ఆర్ట్స్, నిరాయుధ పోరాటం (అన్–ఆర్మ్డ్ కాంబాట్), స్వయంరక్షణ, ఆయుధ శిక్షణ, ఉగ్రవాద నిరోధక శిక్షణ వంటి అనేక కీలక విభాగాల్లో ఆయనకు విశేష అనుభవం ఉంది. తన విశిష్ట సేవలకు గాను 2010లో రాష్ట్రపతి ప్రతిభా సేవా పతకం (మెరిటోరియస్ సర్వీస్ మెడల్) అందుకున్న ఆయన, అనంతరం ప్రెసిడెంట్ పోలీస్ మెడల్ ఫర్ డిస్టింగ్విష్డ్ సర్వీస్ (ఉత్తమ సేవా పతకం)ను కూడా సాధించారు. తన సుదీర్ఘ సేవా కాలమంతా ఎలాంటి క్రమశిక్షణా చర్యలు లేదా శిక్షలు లేకుండా అత్యంత ఆదర్శప్రాయమైన సేవా రికార్డును కొనసాగించడం ఆయన ప్రత్యేకత. జీవీఆర్ కరాటే అకాడమీతో శ్రీ అబ్దుల్ సమద్‌కి ప్రత్యేక అనుబంధం ఉంది. 2016లో ఈ అకాడమీ ద్వారానే ఆయన కరాటే బ్లాక్ బెల్ట్ సాధించారు. ఇప్పటికీ అదే ఆసక్తి, క్రమశిక్షణతో కరాటే సాధనను కొనసాగిస్తూ, ఈ సంవత్సరం తన తదుపరి 'డాన్' గ్రేడింగ్‌కు సిద్ధమవుతున్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి శ్రీ మహమ్మద్ అలీ రఫత్, సీనియర్ న్యాయవాది శ్రీ అశోక్ మరియు జీవీఆర్ కరాటే అకాడమీ వ్యవస్థాపక సంచాలకులు డాక్టర్ జి. ఎస్. గోపాల్ రెడ్డి పాల్గొని శ్రీ షేక్ అబ్దుల్ సమద్‌ను పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించారు.
ఈ సందర్భంగా శ్రీ అబ్దుల్ సమద్ సుదీర్ఘ సేవలు, పోలీసు శిక్షణ రంగానికి ఆయన చేసిన కృషి, క్రమశిక్షణ మరియు మార్షల్ ఆర్ట్స్ పట్ల ఆయనకున్న అంకితభావాన్ని ప్రముఖులు కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఆయన తన అనుభవం, జ్ఞానంతో యువతకు మార్గదర్శకంగా నిలవాలని జీవీఆర్ కరాటే అకాడమీ ప్రతినిధులు ఆకాంక్షించారు.

## ఓబీసీ కులగణనపై కదం తొక్కుతున్న బీసీలు

### శంషాబాద్‌లో ఓబీసీ హక్కుల కోసం భారీ సభ

### కులగణన కోసం గళమెత్తుతున్న బీసీ వర్గాలు

### బీసీల హక్కుల కోసం ఓబీసీ కులగణన అవసరం: మల్లేష్ యాదవ్

హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి అక్టోబర్ 03:)

జాతీయ జనగణనలో ఓబీసీ కులాల గణన చేపట్టాలనే డిమాండ్‌తో అక్టోబర్ 4న శంషాబాద్ గొల్లపల్లి రోడ్డులో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని.....ఓబిసి తెలంగాణ చైర్మన్ షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, మహేశ్వరం మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లేష్ యాదవ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ యాదయ్య, పిలుపునిచ్చారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన న్యాయమైన వాటా, హక్కులు కల్పించేందుకు ఓబీసీ కులగణన ఎంతో కీలకమని అన్నారు. మహేశ్వరం మండల్ అధ్యక్షులు మల్లేష్ యాదవ్ నేతృత్వంలో నిర్వహించే సభకు మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కులగణన ఆవశ్యకతను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు బీసీల హక్కుల సాధనకు సంఘీభావం తెలపాలని సూచించారు. సభ విజయవంతానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ హక్కులకు జనాభా ఆధారిత గణన అవసరమని పేర్కొన్నారు. ప్రతి గ్రామం నుంచి నాయకులు, కార్యకర్తలు సభకు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మహేశ్వరం మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లేష్ యాదవ్ విజ్ఞప్తి చేశారు.



## రెండు డీఏలకు ఆమోదం..

### - మిగిలిన సమస్యలూ పరిష్కరించాలి

### టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గాజే వేణుగోపాల్





**హన్మకొండ, అక్టోబర్ 3, హైదరాబాద్ ఎస్టేట్:**

ఉద్యోగులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పెండింగ్ డీఏల్లో రెండు డీఏలకు ప్రభుత్వం ఆమోదం తెలపడాన్ని టీఎన్జీవో వరంగల్ జిల్లా శాఖ స్వాగతించింది. ఉద్యోగ సంఘాల జేఏసీకి ఇచ్చిన హామీ మేరకు డీఏలను ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రివర్గ సభ్యులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శికి టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గాజే వేణుగోపాల్, కార్యదర్శి పాలకుర్తి సదానందం కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల మిగిలిన సమస్యలపైనా దృష్టి సారించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. పీఆర్సీ నివేదిక తెప్పించి 51 శాతం ఫిట్‌మెంట్‌తో నూతన వేతన సవరణ అమలు, మిగిలిన పెండింగ్ డీఏల విడుదల, ఉద్యోగులుపెన్షనర్ల పెండింగ్ బిల్లుల మంజూరుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయడంతో పాటు ఆరోగ్య కార్డుల అమలులో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్ఎం హుస్సేనీ ముజీబ్‌లకు కూడా వారు ధన్యవాదాలు తెలిపారు.

## ధూల్‌పేట్‌లో ఘనంగా లాల్ బహదూర్ శాస్త్రి 122వ జయంతి వేడుకలు





**ధూల్‌పేట్, అక్టోబర్ 03:**
ధూల్‌పేట్ రహీంపురాలోని అంబేద్కర్ భవన్ ప్రాంగణంలో ఉన్న లాల్ బహదూర్ శాస్త్రి ప్లేగ్రౌండ్‌లో భారత మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి 122వ జయంతి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గోషామహల్ ఎమ్మెల్యే టి. రాజా సింగ్ లోధి ముఖ్య అతిథిగా హాజరై లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... దేశం కోసం శాస్త్రిగారు చేసిన సేవలు, ఆయన నిరాడంబరత, 'జై జవాన్ – జై కిసాన్' నినాదం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అనంతరం పేదలకు, స్థానికులకు పండ్ల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు గోపిశెట్టి ప్రమోద్, మంగళ్‌హాట్ డివిజన్ అధ్యక్షుడు పి. కిషోర్ కుమార్, మాజీ కార్పొరేటర్ శశికళా కృష్ణ జీ, గోల్కొండ జిల్లా అధ్యక్షుడు ఉమా మహేందర్ జీలతో పాటు నాయకులు రఘునందన్ యాదవ్, రవీందర్ సింగ్, ముకేష్ సింగ్, నవీన్ చుకా, సురేష్ సింగ్, బబ్లూ గౌడ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు అశోక్ సింగాల్ శత జయంతి వేడుకలు

### కర్మన్‌ఘాట్ ఎస్‌వైఆర్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహణ

### ముఖ్య అతిథులుగా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, చంపత్ రాయ్

### భారీగా తరలిరావాలని వీహెచ్‌పీ నేత బాలస్వామి పిలుపు

భాగ్యనగరం, అక్టోబర్ 03: విశ్వహిందూ పరిషత్ అగ్రనేత, దివంగత అశోక్ సింగాల్ శత జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు వీహెచ్‌పీ తెలంగాణ ధర్మాచార్య సంపర్క ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి తెలిపారు. వీహెచ్‌పీ తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో అక్టోబర్ 4 (ఆదివారం) సాయంత్రం 4 గంటలకు కర్మన్‌ఘాట్ సమీపంలోని ఎస్‌వైఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం జరగనుంది.
ఈ వేడుకకు భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు, వీహెచ్‌పీ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు చంపత్ రాయ్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు బాలస్వామి వెల్లడించారు. హిందూ సమాజ సంఘటితం, ధార్మిక చైతన్యం, అయోధ్య శ్రీరామ జన్మభూమి ఉద్యమంలో అశోక్ సింగాల్ పోషించిన కీలక పాత్రను స్మరించుకుంటూ ఈ వేడుకలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.
అశోక్ సింగాల్ శత జయంతి ఉత్సవాలు 2026 సెప్టెంబర్ 27 నుండి 2027 సెప్టెంబర్ 27 వరకు ఏడాది పాటు ప్రపంచవ్యాప్తంగా సాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి కరసేవకులు, స్వయంసేవకులు, ధర్మాచార్యులు, హిందూ బంధువులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



## బీసీ రిజర్వేషన్లపై మాట్లాడే హక్కు వైసీపీకి లేదు

### : రామ్మోహన్ నాయుడు



వైసీపీపై కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదని ఆయన ధ్వజమెత్తారు. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నియోజకవర్గంలో ఎమ్మెల్యే గోవిందరావుతో కలిసి 'పల్లె పండుగ 3.0' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ... బీసీలకు రాజ్యాధికారం దక్కకూడదనే ఉద్దేశంతోనే గతంలో వైసీపీ ప్రభుత్వం రిజర్వేషన్లను అడ్డుకుందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ కోటాపై గతంలో కోర్టు తీర్పు ఇస్తే, దానిపై అప్పటి జగన్ ప్రభుత్వం ఎందుకు పోరాడలేదని ఆయన ప్రశ్నించారు. బీసీలకు వైసీపీ తీవ్ర అన్యాయం చేసిందని మండిపడ్డారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అమలు కోసం సుప్రీంకోర్టులో పోరాటం చేస్తోందని తెలిపారు. గతంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించిందే తెలుగుదేశం పార్టీ అని గుర్తుచేశారు. బీసీలు ఉన్నత స్థాయిలో ఉండాలన్నదే టీడీపీ లక్ష్యమని స్పష్టం చేశారు. టీడీపీకి బీసీలే వెన్నెముక అని, తమది బీసీల పార్టీ అని అన్నారు. జగన్ అండ్ కో ఆటలు ఇకపై చెల్లవని హెచ్చరించారు.

## విశిష్ట సేవా పతక గ్రహీత షేక్ అబ్దుల్ సమద్‌కి జీవీఆర్ కరాటే అకాడమీ ఘన సన్మానం

హైదరాబాద్, అక్టోబర్ 03:
ప్రెసిడెంట్ పోలీస్ మెడల్ ఫర్ డిస్టింగ్విష్డ్ సర్వీస్ (రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం) అందుకున్న శ్రీ షేక్ అబ్దుల్ సమద్‌ను జీవీఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. షేక్ అబ్దుల్ సమద్ సిఆర్‌పిఎఫ్ మరియు నేషనల్ పోలీస్ అకాడమీలో దాదాపు 41 సంవత్సరాల పాటు విశిష్ట సేవలు అందించారు. 1985లో కానిస్టేబుల్‌గా తన సేవా ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన, క్రమశిక్షణ, అంకితభావం మరియు కృషితో ఇన్‌స్పెక్టర్, డ్రిల్ ఇన్‌స్ట్రక్టర్ స్థాయికి ఎదిగారు. తన సేవా కాలంలో ఐపిఎస్ ప్రొబేషనరీ అధికారులు, నేరుగా నియామకమైన సబ్–ఇన్‌స్పెక్టర్లు మరియు అనేక మంది పోలీసు సిబ్బందికి ఆదర్శవంతమైన శిక్షణ అందించారు.
పంజాబ్, అస్సాం, జమ్మూ–కాశ్మీర్ మరియు త్రిపుర వంటి సమస్యాత్మక ప్రాంతాల్లో కూడా ఆయన సేవలు అందించారు. శారీరక శిక్షణ, డ్రిల్, మార్షల్ ఆర్ట్స్, నిరాయుధ పోరాటం (అన్–ఆర్మ్డ్ కాంబాట్), స్వయంరక్షణ, ఆయుధ శిక్షణ, ఉగ్రవాద నిరోధక శిక్షణ వంటి అనేక కీలక విభాగాల్లో ఆయనకు విశేష అనుభవం ఉంది.
తన విశిష్ట సేవలకు గాను 2010లో రాష్ట్రపతి ప్రతిభా సేవా పతకం (మెరిటోరియస్ సర్వీస్ మెడల్) అందుకున్న ఆయన, అనంతరం ప్రెసిడెంట్ పోలీస్ మెడల్ ఫర్ డిస్టింగ్విష్డ్ సర్వీస్ (ఉత్తమ సేవా పతకం)ను కూడా సాధించారు. తన సుదీర్ఘ సేవా కాలమంతా ఎలాంటి క్రమశిక్షణా చర్యలు లేదా శిక్షలు లేకుండా అత్యంత ఆదర్శప్రాయమైన సేవా రికార్డును కొనసాగించడం ఆయన ప్రత్యేకత.జీవీఆర్ కరాటే అకాడమీతో శ్రీ అబ్దుల్ సమద్‌కి ప్రత్యేక అనుబంధం ఉంది. 2016లో ఈ అకాడమీ ద్వారానే ఆయన కరాటే బ్లాక్ బెల్ట్ సాధించారు. ఇప్పటికీ అదే ఆసక్తి, క్రమశిక్షణతో కరాటే సాధనను కొనసాగిస్తూ, ఈ సంవత్సరం తన తదుపరి 'డాన్' గ్రేడింగ్‌కు సిద్ధమవుతున్నారు.
ఈ సన్మాన కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి శ్రీ మహమ్మద్ అలీ రఫత్, సీనియర్ న్యాయవాది శ్రీ అశోక్ మరియు జీవీఆర్ కరాటే అకాడమీ వ్యవస్థాపక సంచాలకులు డాక్టర్ జి. ఎస్. గోపాల్ రెడ్డి పాల్గొని శ్రీ షేక్ అబ్దుల్ సమద్‌ను పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించారు.
ఈ సందర్భంగా శ్రీ అబ్దుల్ సమద్ సుదీర్ఘ సేవలు, పోలీసు శిక్షణ రంగానికి ఆయన చేసిన కృషి, క్రమశిక్షణ మరియు మార్షల్ ఆర్ట్స్ పట్ల ఆయనకున్న అంకితభావాన్ని ప్రముఖులు కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఆయన తన అనుభవం, జ్ఞానంతో యువతకు మార్గదర్శకంగా నిలవాలని జీవీఆర్ కరాటే అకాడమీ ప్రతినిధులు ఆకాంక్షించారు.



RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
04,అక్టోబర్ ఆదివారం 2026

# గెలుపు ఆశ.. కుటుంబానికి ఆర్థిక ఉచ్చు

## - మొబైల్ తెరపై మొదలయ్యే ఆట.. - నష్టాల వెంట కుటుంబ ఆర్థిక భద్రతకూ ముప్పు

## - మనీ గేమింగ్‌పై చట్టపరమైన కట్టడి.. - పిల్లలు, యువత విషయంలో తల్లిదండ్రుల అప్రమత్తతే తొలి రక్షణ

**హైదరాబాద్ ఎస్టేట్ ప్రత్యేక విశ్లేషణ:**

మొబైల్ చేతిలోకి వచ్చాక ప్రపంచం అరచేతిలోకి వచ్చింది. చదువు, సమాచారం, వినోదంతో పాటు రకరకాల ఆటలూ అందుబాటులోకి వచ్చాయి. అయితే ఇదే సాంకేతికత డబ్బుతో ముడిపడిన ఆన్‌లైన్ ఆటలకు కూడా విస్తృత వేదికగా మారింది. తొలుత సరదాగా మొదలయ్యే ఆట.. చిన్న మొత్తంతో చేసే ప్రయత్నం.. ఒకసారి గెలిస్తే మరింత డబ్బు సంపాదించవచ్చనే ఆశ.. ఓడిపోయిన తర్వాత పోయిన మొత్తాన్ని తిరిగి సాధించాలనే ప్రయత్నం.. ఇలా ఒక దశ తర్వాత ఆట కంటే డబ్బే ప్రధాన లక్ష్యంగా మారితే అసలు ప్రమాదం అక్కడే మొదలవుతుంది. వ్యక్తి జేబుతో మొదలైన నష్టం చివరకు కుటుంబ ఆర్థిక భద్రతను తాకే అవకాశం ఉంటుంది. అయితే ప్రతి ఆన్‌లైన్ ఆటనూ ఒకే కోణంలో చూడటం సరైంది కాదు. ఆన్‌లైన్ మనీ గేమ్స్, సాధారణ సామాజిక ఆటలు, ఈ–స్పోర్ట్స్ వేర్వేరు. ఒక ఆటలో డబ్బు లేదా ఇతర విలువైన వాటిని పెట్టి ఆర్థిక లాభం పొందాలనే ఉద్దేశం ఉందా? అన్నదే కీలకమైన ప్రశ్న. ఆట పేరేమిటన్నదానికంటే అందులో డబ్బు లేదా విలువైన వాటిని పణంగా పెట్టే విధానం, దాని ద్వారా ఆర్థిక లాభం పొందే అవకాశం ఉందా అన్నదే అసలు అంశం. ఈ ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం లి'ఆన్‌లైన్ గేమింగ్ ప్రోత్సాహం, నియంత్రణ చట్టం2025'లిను తీసుకొచ్చింది. ఆన్‌లైన్ మనీ గేమింగ్‌ను నిర్వహించడం, అందించడం, నిర్వహణకు సహకరించడం లేదా ప్రోత్సహించడం వంటి చర్యలను చట్టంలోని 5వ సెక్షన్ నిషేధిస్తుంది. నిషేధిత మనీ గేమింగ్‌ను ప్రోత్సహించే ప్రకటనలపై 6వ సెక్షన్ ద్వారా ఆంక్షలు విధించారు. అలాంటి సేవలకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలను అడ్డుకునేలా 7వ సెక్షన్‌లో నిబంధనలు ఉన్నాయి. అంటే ఆటను నిర్వహించే వేదిక మాత్రమే కాకుండా దాని ప్రచారం, ఆర్థిక లావాదేవీల వ్యవస్థపైనా చట్టం దృష్టి పెట్టింది. నిబంధనలు ఉల్లంఘిస్తే శిక్షలు కూడా సాధారణమైనవి కావు. సంబంధిత నేరాలకు జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉంది. అదే నేరం పునరావృతమైతే శిక్ష మరింత కఠినమవుతుంది. ముఖ్యంగా 5, 7వ సెక్షన్ల కింద నమోదయ్యే నేరాలను గుర్తించగలిగే నేరాలుగా, బెయిల్ సులభంగా లభించని నేరాలుగా చట్టం పేర్కొంది. దీంతో ఆన్‌లైన్ మనీ గేమింగ్‌ను కేవలం వినోద రంగానికి సంబంధించిన అంశంగా కాకుండా చట్టపరమైన నియంత్రణకు లోబడి ఉన్న వ్యవహారంగా చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే చట్టం ఎంత కఠినంగా ఉన్నా.. ప్రమాదం మొదలయ్యే చోట కుటుంబం అప్రమత్తంగా లేకపోతే సమస్యను పూర్తిగా అడ్డుకోవడం కష్టం. ఉదాహరణకు ఒక యువకుడు చిన్న మొత్తంతో ఆన్‌లైన్ మనీ గేమ్‌లోకి ప్రవేశించాడనుకుందాం. మొదట కొంత మొత్తం గెలిస్తే తక్కువ సమయంలో డబ్బు సంపాదించగలననే నమ్మకం పెరగవచ్చు. ఆ తర్వాత ఎక్కువ మొత్తం పెట్టి నష్టపోయినప్పుడు ఆ నష్టాన్ని పూడ్చుకోవడానికి మళ్లీ డబ్బు పెట్టే పరిస్థితి రావచ్చు. ఒక నష్టాన్ని మరో ఆటతో భర్తీ చేయాలనే ఆలోచన పెరిగేకొద్దీ పెట్టుబడి పెరగవచ్చు. చివరకు వ్యక్తిగత ఖర్చులు, కుటుంబ పొదుపులు, అవసరాల కోసం ఉంచిన డబ్బు, అప్పులు వంటి అంశాలు ఈ చక్రంలోకి వచ్చే ప్రమాదం ఉంటుంది. ఇది ప్రతి ఆన్‌లైన్ గేమ్ ఆడే వ్యక్తికి తప్పనిసరిగా జరిగే పరిణామం కాదు. కానీ డబ్బు కోల్పోయిన తర్వాత దానిని తిరిగి సాధించాలనే తొందర నిర్ణయాలను ప్రభావితం చేసే అవకాశం ఉంది. అందుకే 'గెలిస్తే ఆదాయం.. ఓడితే మరోసారి ప్రయత్నం' అనే ఆలోచన ప్రమాదకరమైన ఆర్థిక అలవాటుగా మారకుండా చూడటం అవసరం. ముఖ్యంగా తక్కువ వయసులో డబ్బు విలువ, నష్టం ప్రభావం, ఆన్‌లైన్ మోసాల ప్రమాదం పూర్తిగా అర్థం కాకపోవచ్చు. పిల్లలు, యువత విషయంలో తల్లిదండ్రుల పాత్ర అందుకే కీలకం. మొబైల్‌లో ఏ ఆటలు ఆడుతున్నారు? వాటిలో డబ్బు చెల్లించాలా? డబ్బు పెట్టి బహుమతి లేదా లాభం పొందే అవకాశం ఉందా? పిల్లల ఖాతాల్లో అనుమానాస్పద లావాదేవీలు జరుగుతున్నాయా? అనే విషయాలపై తల్లిదండ్రులు అవగాహనతో ఉండాలి. కేవలం మొబైల్ తీసుకోవడం లేదా పూర్తిగా నిషేధించడం కంటే డిజిటల్ వినియోగంపై పిల్లలతో మాట్లాడటం, డబ్బుతో కూడిన ఆటల ప్రమాదాన్ని వివరించడం, అవసరమైన నియంత్రణలను ఉపయోగించడం మరింత ప్రభావవంతమైన రక్షణగా ఉంటుంది. ఆన్‌లైన్ గేమింగ్ రంగంపై పర్యవేక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ఆన్‌లైన్ గేమింగ్ అథారిటీ ఆఫ్ ఇండియాను ఏర్పాటు చేసింది. ఇందుకు సంబంధించిన అధికారిక నోటిఫికేషన్ 2026 ఏప్రిల్ 22న వెలువడింది. 2026 నిబంధనలు మే 1 నుంచి అమల్లోకి వచ్చాయి. నిషేధిత ఆన్‌లైన్ మనీ గేమింగ్‌కు సంబంధించిన సేవలు, ప్రకటనలు, ఆర్థిక లావాదేవీలపై చర్యలు తీసుకునేందుకు చట్టం వివిధ మార్గాలను నిర్దేశించింది. అవసరమైన సందర్భాల్లో నిరోధం, దర్యాప్తు, ఎలక్ట్రానిక్ రికార్డుల పరిశీలన వంటి చర్యలకు కూడా చట్టపరమైన విధానాన్ని కల్పించింది. ఇక్కడే చట్టం ముందు ఉన్న అసలు పరీక్ష మొదలవుతుంది.

నిబంధనలు రూపొందించడం ఒక దశ అయితే.. వాటిని డిజిటల్ వేదికలపై సమర్థంగా అమలు చేయడం మరో దశ. నిషేధిత ఆటలను గుర్తించడం, వాటి ప్రకటనలను అడ్డుకోవడం, సంబంధిత ఆర్థిక లావాదేవీలను నియంత్రించడం, ఉల్లంఘనలకు పాల్పడే వేదికలపై చర్యలు తీసుకోవడం, వినియోగదారులకు సరైన సమాచారం అందించడం వంటి అంశాల్లో అమలు వ్యవస్థ ఎంత సమర్థంగా పనిచేస్తుందన్నదే ఫలితాన్ని నిర్ణయిస్తుంది. సాంకేతికత వేగంగా మారుతున్న నేపథ్యంలో చట్ట అమలు కూడా అదే వేగంతో స్పందించాల్సిన అవసరం ఉంది. మరోవైపు డిజిటల్ ప్రపంచంలో పిల్లలకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వడం ఎంత ప్రమాదకరమో, ప్రతి ఆటను అనుమానంతో చూడటం కూడా సరైనది కాదు. అవగాహన, బాధ్యతాయుత వినియోగం, కుటుంబ పర్యవేక్షణ మధ్య సమతుల్యత అవసరం. ఆన్‌లైన్ ఆట వినోదం కోసం మాత్రమేనా? లేక డబ్బు పెట్టి లాభం పొందాలనే ఉద్దేశంతో నడుస్తోందా? అనే విషయాన్ని ముందుగానే గుర్తించే అలవాటు పెరగాలి. ఆన్‌లైన్ మనీ గేమింగ్ సమస్యను కేవలం వ్యక్తిగత అలవాటుగా చూడటం కూడా సరిపోదు. దీనికి ఆర్థిక, సామాజిక, కుటుంబ పరమైన ప్రభావాలు ఉన్నాయి. ఒక వ్యక్తి నష్టపోతే అది అతడి వ్యక్తిగత సమస్యగానే మిగలకపోవచ్చు. కుటుంబ అవసరాలకు కేటాయించిన డబ్బు తగ్గడం, అప్పుల భారం పెరగడం, కుటుంబ సభ్యుల మధ్య ఆర్థిక ఒత్తిడి ఏర్పడటం వంటి పరిణామాలు చోటుచేసుకోవచ్చు. అందుకే ఆన్‌లైన్ మనీ గేమింగ్‌పై చట్టపరమైన నియంత్రణతో పాటు కుటుంబ స్థాయిలో అవగాహన కూడా అవసరం. చివరికి ప్రశ్న 'ఆట ఆడాలా? వద్దా?' అన్నది మాత్రమే కాదు. డబ్బు, ఆశ, నష్టంఈ మూడింటి మధ్య ఏర్పడే ప్రమాదకరమైన చక్రాన్ని ఎక్కడ ఆపాలి? అన్నదే అసలు ప్రశ్న. చట్టం నిషేధిత కార్యకలాపాలను అడ్డుకునే వ్యవస్థను అందిస్తుంది.

కానీ చట్టం చేరకముందే కుటుంబంలో అవగాహన మొదలైతే ప్రమాదాన్ని మరింత ముందుగానే అడ్డుకోవచ్చు. మొబైల్ తెరపై మొదలయ్యే ప్రతి ఆట గెలుపుతోనే ముగియదు. గెలుపు ఆశతో మొదలైన ఆట నష్టాల వెంట పరుగెత్తే పరిస్థితికి మారకుండా చూడాల్సిన బాధ్యత వ్యక్తిపైనే కాదు.. కుటుంబంపైనా, సమాజంపైనా, చట్టాన్ని అమలు చేసే వ్యవస్థలపైనా ఉంది. పిల్లల అవగాహన, తల్లిదండ్రుల అప్రమత్తత, చట్టాల సమర్థ అమలుఈ మూడు కలిసినప్పుడే ఆన్‌లైన్ మనీ గేమింగ్ వల్ల కుటుంబ ఆర్థిక భద్రతకు ఏర్పడే ముప్పును సమర్థంగా ఎదుర్కొనే అవకాశం ఉంటుంది.

# ప్రమాదంలో మృతి చెందిన లింగాల కేదారి కుటుంబానికి రూ.10 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

## ఉద్యమకారులను గుర్తించి అండగా నిలుస్తున్న ప్రజా ప్రభుత్వం: ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ**

**హనుమకొండ, అక్టోబర్ 3, శనివారం:**



ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన లింగాల కేదారి, పుష్పలత దంపతుల కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు ముఖ్యమంత్రి సహాయ నిధి (జవీ=ఖీ) ద్వారా మంజూరు చేసిన రూ.10 లక్షల ఆర్థిక సాయం చెక్కును శనివారం అందజేశారు.వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారు, వర్ధన్నపేట ఎమ్మెల్యే శ్రీ కేఆర్ నాగరాజు గారు, డీసీసీ అధ్యక్షులు శ్రీ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి గారు కేదారి కుటుంబ సభ్యుల ఇంటికి వెళ్లి చెక్కును అందజేసి, కుటుంబాన్ని పరామర్శించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారు మాట్లాడుతూ..

తెలంగాణ ఉద్యమ సమయంలో ఆనాటి ఉద్యమకారులకు ఆపన్నహస్తం అందిస్తూ అండగా నిలిచిన లింగాల కేదారి సేవలను తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం గుర్తించి, ఆయన కుటుంబానికి ఆర్థిక చేయూత అందించిందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమ సమయంలో పోరాడిన ఉద్యమకారులను ప్రజా ప్రభుత్వం గౌరవిస్తుందని, రానున్న రోజుల్లోనూ ఉద్యమంలో పాల్గొని పోరాటం చేసిన ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తుందని అన్నారు
.కేదారి కుటుంబం ప్రస్తుత కష్టకాలంలో తాను వ్యక్తిగతంగా కూడా అండగా ఉంటానని, తన వంతుగా కుటుంబ సభ్యులను అన్ని విధాలుగా ఆదుకుంటానని ఎమ్మెల్యే నాయిని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించిన ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలిపారు.ప్రజా ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి, ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకోవడానికి కట్టుబడి ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆసియా క్రీడల్లో టీమిండియాకు స్వర్ణం..

## చంద్రబాబు, నారా లోకేశ్ అభినందనలు



ఆసియా క్రీడలు 2026లో భారత పురుషుల క్రికెట్ జట్టు స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై 19 పరుగుల తేడాతో విజయం సాధించి, మరోసారి ఆసియా ఛాంపియన్‌గా నిలిచింది. ఈ విజయంతో భారత్ వరుసగా రెండోసారి ఆసియా గేమ్స్ స్వర్ణాన్ని గెలుచుకుని తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకుంది. శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలోని యువ జట్టు అద్భుతమైన నైపుణ్యం, సంయమనంతో కూడిన ప్రదర్శన కనబరిచి దేశానికి గర్వకారణంగా నిలిచింది.ఈ చారిత్రక విజయంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ భారత జట్టుకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. "ఆసియా గేమ్స్ 2026లో పాకిస్థాన్‌ను ఓడించి స్వర్ణం గెలిచిన భారత పురుషుల క్రికెట్ జట్టుకు హృదయపూర్వక అభినందనలు. వరుసగా రెండోసారి స్వర్ణ పతకం గెలిచి టైటిల్‌ను నిలబెట్టుకోవడం అద్భుతం. ఆటగాళ్లు కనబరిచిన నైపుణ్యం యావత్ దేశం గర్వించేలా చేసింది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌తో పాటు జట్టు సభ్యులందరినీ ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు.మంత్రి నారా లోకేశ్ సైతం భారత జట్టును అభినందించారు. "ఉత్కంఠభరిత ఫైనల్‌లో పాకిస్థాన్‌ను ఓడించి మన ఆసియా గేమ్స్ స్వర్ణాన్ని విజయవంతంగా నిలబెట్టుకున్న టీమిండియాకు అభినందనలు. అభిషేక్ శర్మ, తిలక్ వర్మల ప్రత్యేక ప్రదర్శనలు ఈ ఫైనల్‌ను చిరస్మరణీయం చేశాయి," అని ఆయన అన్నారు. ఇప్పటికే మహిళల జట్టు కూడా స్వర్ణం గెలుచుకోవడంతో, ఆసియా క్రీడల్లో క్రికెట్‌లో భారత్ "డబుల్ గోల్డ్" సాధించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ రెండు విజయాలతో ఆసియా గేమ్స్ క్రీడా యవనికపై భారత కీర్తి పతాక రెపరెపలాడింది.

# ఆర్టీసీ యూనియన్ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు గారు...

**హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ**



తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల నేపథ్యంలో హనుమకొండ, వరంగల్ పరిధిలోని ఆర్టీసీ డిపోల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి శ్రీ కేఆర్ నాగరాజు గారు హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనుగాల వెంకట్రాంరెడ్డి గారితో కలిసి హనుమకొండ డిపో పరిధిలో ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ...కార్మికుల సమస్యలు, వారి సంక్షేమానికి సంబంధించిన అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్టీసీ సంస్థ అభివృద్ధిలో కార్మికుల పాత్ర ఎంతో కీలకమని, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంలో వారు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు.ఆర్టీసీ కార్మికుల హక్కులు, సంక్షేమం, ఉద్యోగ భద్రత, మెరుగైన పని పరిస్థితుల కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే గారు తెలిపారు. సంస్థ అభివృద్ధితో పాటు కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.ఆర్టీసీ అభివృద్ధిలో కార్మికులే కీలకమని ఎమ్మెల్యే అన్నారు. కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, సంక్షేమం కోసం నిరంతరం అండగా ఉంటామని, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. సంస్థ బలోపేతంతో పాటు కార్మికుల సంక్షేమానికి సమాన ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల్లో తమకు మద్దతు ఇవ్వాలని కార్మికులను కోరారు.ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెట్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆర్టీసీ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వానికి ఏపీ ఎన్జీవోల కృతజ్ఞతలు..

## 25 రోజుల్లోనే హామీల అమలుపై హర్షం



రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలపై ఏపీ ఎన్జీవో సంఘం హర్షం వ్యక్తం చేసింది. కేవలం 25 రోజుల్లోనే కీలక హామీలను నెరవేరుస్తూ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షులు ఆలపర్తి విద్యాసాగర్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఉద్యోగులకు, పెన్షనర్లకు జీతాలతో కలిపి రెండు డీఏలను ప్రభుత్వం చెల్లించిందని గుర్తుచేశారు. 12వ పీఆర్సీ కమిటీ చైర్మన్‌గా మాజీ సీఎస్ దినేశ్ కుమార్‌ను నియమించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ అమలు చేయడం, పెన్షనర్లకు డిసెంబర్ 1 నుంచి అదనపు క్వాంటమ్ పెన్షన్ వర్తింపజేయడం సంతోషకరమని అన్నారు.ఆరోగ్య కార్డుల సమస్య పరిష్కారానికి నెలకు రూ.36 కోట్ల నుంచి రూ.40 కోట్లు నేరుగా ట్రస్ట్‌కు జమ అయ్యేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని విద్యాసాగర్ వివరించారు. ఆరోగ్య కార్డు నిధులు నేరుగా ట్రస్ట్‌కు వెళ్లేలా చర్యలు తీసుకోవడం గత పదేళ్లలో ఇదే తొలిసారని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగుల డిమాండ్ల పట్ల సానుకూలంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వానికి ఉద్యోగుల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. ప్రభుత్వం ఉద్యోగులకు మెరుగైన, నగదు రహిత వైద్య సేవలు అందించేందుకు చర్యలు చేపడుతోందని ఆయన తెలిపారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
తెలుగు దిన పత్రిక
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
hyderabadestate.co.in



# చంద్రబాబుకు ఇప్పుడు యంగ్ హార్డ్ వేర్ టీమ్ అండగా ఉంది

**: పాన్ ఐఐటీ సమ్మిట్ లో మంత్రి లోకేశ్**

**- విజయవాడలో 'పాన్ ఐఐటీ సమ్మిట్ - 2026**

**హాజరైన మంత్రి నారా లోకేశ్**

**- ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చెందిన రాష్ట్రంగా మార్చడమే లక్ష్యమని ఉద్ఘాటన**

**- చంద్రబాబు అనుభవానికి యువ ఎమ్మెల్యేల బృందం తోడైందని వెల్లడి**





ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవం అనే బలమైన సాఫ్ట్‌వేర్‌కు, యువతతో నిండిన చురుకైన హార్డ్‌వేర్ టీమ్ ఇప్పుడు అండగా నిలిచిందని, ఈ అరుదైన కలయికతో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. విజయవాడలో జరిగిన 'పాన్ ఐఐటీ సమ్మిట్ – 2026'లో ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ 'వికసిత్ భారత్' లక్ష్యానికి తమ వంతు సహకారం అందిస్తామని, అభివృద్ధి చెందిన రాష్ట్రంగా ఏపీని మార్చడమే తమ ఉమ్మడి లక్ష్యమని అన్నారు. "ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రస్తుతం 4.0 ఆపరేటింగ్ సిస్టమ్‌తో మరింత ఉత్సాహంగా పనిచేస్తున్నారు. ఆయనకు ఇప్పుడు ఒక యంగ్ హార్డ్‌వేర్ టీమ్ అండగా ఉంది. మా శాసనసభ్యుల్లో 50 శాతం మంది మొదటిసారి గెలిచినవారే. 25 మంది మంత్రులలో 17 మంది తొలిసారి మంత్రులయ్యారు. అనుభవజ్ఞమైన సాఫ్ట్‌వేర్‌కు, ఈ యువ, డైనమిక్ హార్డ్‌వేర్ కలయికే నేటి ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా నిలబెడుతోంది. ఏ రంగంలోనైనా ఆంధ్రప్రదేశ్ నంబర్ వన్‌గా ఉండాలన్నదే మా స్పష్టమైన విజన్" అని లోకేశ్ వివరించారు. 5 లక్షల మందికి పైగా ఐఐటీ గ్రాడ్యుయేట్లను కలిపే పాన్ ఐఐటీ సదస్సు ఏపీలో జరగడం ఆనందంగా ఉందన్నారు.

**అభివృద్ధికి '3ఎ' మంత్రం**

అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి భారత్‌కు ఒక దశాబ్దం చాలని, ఆ స్వర్ణ దశాబ్దం మనదే కావాలని ఆకాంక్షించిన లోకేశ్, దీనికి తమ ప్రభుత్వం '3ఎ' మంత్రాన్ని అనుసరిస్తోందని తెలిపారు. "మొదటిది స్పీడ్ (వేగం), రెండోది సర్వీస్ (సేవ), మూడోది స్టెబిలిటీ (స్థిరత్వం). ప్రజలు మాకు ఇచ్చింది ఐదేళ్ల సమయం. ఈ సమయంలోనే ఫలితాలు చూపించాలి. కేవలం ఎంఓయూలు కుదుర్చుకుని వాటిని మర్చిపోయే రకం మాది కాదు. ప్రాజెక్టులకు వాస్తవ రూపమిచ్చి ఉద్యోగాలు సృష్టించాలన్న తపన మాది. పరిశ్రమదారులను మేము 'జాతి నిర్మాణకర్తలు'గా భావిస్తున్నాం. వారితో కలిసి పనిచేస్తూ, ప్రపంచ స్థాయి పాలన అందించడమే మా సేవా దృక్పథం. ఇక మూడోది స్థిరత్వం. మా పాలసీలు కాలపరీక్షను, రాజకీయ మార్పులను తట్టుకుని నిలబడేలా ఉంటాయి" అని ఆయన అన్నారు. ఇందుకు ఉదాహరణగా, గత కేసులన్నింటినీ ఏఐ ద్వారా విశ్లేషించి, న్యాయపరమైన చిక్కులు రాకుండా 16,000 ఉపాధ్యాయుల నియామక ప్రక్రియను చేపట్టామని గుర్తుచేశారు.

**అమలుపైనే దృష్టి.. ఇవే మా నిదర్శనాలు**

కేవలం కాగితాలపై హామీలు కాకుండా, వాస్తవంగా అమలవుతున్న ప్రాజెక్టుల గురించి లోకేశ్ సవివరంగా మాట్లాడారు. "ఏపీలో నమో అంటే నాయుడు జీ, మోదీజీ జోడీ. డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ ప్రభుత్వం ఉండటం వల్లే పనులు వేగంగా జరుగుతున్నాయి. ఏపీని గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా మార్చాలన్న సీఎం సంకల్పంతో రిలయెన్స్ భాగస్వామ్యంతో మదనపల్లెలో 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్'కు శంకుస్థాపన చేశాం. ఇది లక్ష కోట్ల పెట్టుబడులను ఆకర్షిస్తుంది" అని తెలిపారు.

"ఇతర రాష్ట్రాల్లో దశాబ్దాలుగా నిలిచిపోయిన ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ప్రాజెక్టుకు కేవలం 17 నెలల్లోనే పునాది వేశాం. విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ కోసం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని 13 నెలల్లోనే అనుమతులు సాధించి పనులు ప్రారంభించాం. దేశంలో ఎవరూ ఊహించని ధరకు స్పేస్ టెక్ స్టార్టప్ స్కైరూట్‌కు 300 ఎకరాలు కేటాయించాం. మారిటైమ్ డ్రోన్లు తయారుచేసే సాగర్ డిఫెన్స్ సంస్థకు ఫిషింగ్ హార్బర్‌లో స్థలం ఇవ్వగా, 18 నెలల్లో ఆ సంస్థ విలువ రూ.3,000 కోట్ల నుంచి రూ.23,000 కోట్లకు పెరిగింది. ఇదే మా ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనం" అని లోకేశ్ పేర్కొన్నారు.

**23 క్లస్టర్ల ఏర్పాటు.. అమరావతిపై ప్రత్యేక దృష్టి**

రాష్ట్రంలో హార్టికల్చర్ నుంచి క్వాంటం కంప్యూటింగ్ వరకు 23 పారిశ్రామిక క్లస్టర్లను ఏర్పాటు చేస్తున్నామని, రెన్యువబుల్ ఎనర్జీలో ఏడాదిలోనే 4.8 గిగావాట్ల సామర్థ్యాన్ని జోడించామని లోకేశ్ వెల్లడించారు. అమరావతి నిర్మాణంపై మాట్లాడుతూ, "మీరు అమరావతికి వస్తే, నిర్మాణంలో ఉన్న ఒక ఆధునిక నగరం కనిపిస్తుంది. ప్రపంచ ప్రఖ్యాత ఆర్కిటెక్ట్ నార్మన్ ఫాస్టర్ డిజైన్లతో అసెంబ్లీ, సచివాలయం వంటివి నిర్మిస్తున్నాం. ఇక్కడ 5,000 ఎకరాల్లో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మించబోతున్నాం. హైదరాబాద్ అభివృద్ధిలో శంషాబాద్ విమానాశ్రయం పోషించిన పాత్రను ఇది పోషిస్తుంది" అని అన్నారు.

**ఐఐటీయన్లకు రెండు విజ్ఞప్తులు**

ఈ సందర్భంగా పాన్ ఐఐటీ కమ్యూనిటీకి లోకేశ్ రెండు విజ్ఞప్తులు చేశారు. "మొదటిది, ప్రపంచాన్ని జయించిన మీ గ్రాడ్యుయేట్ల పరిజ్ఞానాన్ని, మార్గదర్శకత్వాన్ని మా 23 క్లస్టర్ల అభివృద్ధికి అందించాలి. రెండోది, 'జుగాడ్' మోడల్ నుంచి 'వ్యవస్థీకృత వేగం' వైపు ఏపీ ప్రయాణించడానికి, ఏఐ సాయంతో మెరుగైన పాలన అందించడానికి మీరంతా సహకరించాలి. ఇతర దేశాల మోడళ్ల గురించి మాట్లాడటం కాదు, భారత్ ఏం చేయగలదో ప్రపంచానికి చూపించాలి. అందుకు ఆంధ్రప్రదేశ్‌ను ఒక ఆదర్శంగా నిలపాలనుకుంటున్నాం" అని లోకేశ్ తన ప్రసంగాన్ని ముగించారు.

# డాక్టర్ కాసం వెంకటేశ్వర్లుకి ఘన స్వాగతం

**సిపిఆర్ఐ గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు**

**బిజెవైఎం రాష్ట్ర నాయకుడు కన్నెబోయిన రాము యాదవ్ ఆధ్వర్యంలో కార్యక్రమం**





మేడిపల్లి, అక్టోబర్ 03:
భాజపా కర్ణాటక సహ ఇన్‌ఛార్జ్ (సహ ప్రభారి)గా నియమితులైన అనంతరం తొలిసారిగా శ్రీ యాదగిరి లక్ష్మీనరసింహస్వామి ్డశీశనానికి విచ్చేస్తున్న డాక్టర్ కాసం వెంకటేశ్వర్లుకి సిపిఆర్ఐ గణపతి దేవాలయం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.
బిజెవైఎం రాష్ట్ర నాయకుడు కన్నెబోయిన రాము యాదవ్ ఆధ్వర్యంలో సిపిఆర్ఐ గణపతి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు.
ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఏనుగు సుదర్శన్ రెడ్డి, బండారు పవన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, గీతా రామ్, నవ్య రెడ్డి, శ్రీకాంత్, అలాగే యాదాద్రి భువనగిరి జిల్లా ముఖ్య నాయకులు, మాజీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్ రెడ్డి, బిజేవైఎం జిల్లా అధ్యక్షుడు కుమార్ స్వామి, సోమ నరసయ్య, పన్నాల చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా మేడిపల్లి ప్రాంతానికి చెందిన బిజెపి శ్రేణులు, యాదాద్రి భువనగిరి జిల్లా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై డాక్టర్ కాసం వెంకటేశ్వర్లుకి పూలమాలలతో స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.
కర్ణాటక రాష్ట్ర సహ ఇన్‌ఛార్జ్‌గా కీలక బాధ్యతలు స్వీకరించిన ఆయన నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం కావాలని నాయకులు ఆకాంక్షించారు. సాధారణ కార్యకర్త కూడా అంచెలంచెలుగా ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశం కేవలం భారతీయ జనతా పార్టీలోనే సాధ్యమని, అందుకు డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు నియామకమే నిదర్శనమని నేతలు పేర్కొన్నారు. ఆధ్యాత్మిక వాతావరణంలో, కార్యకర్తల ఉత్సాహాల నడుమ ఈ కార్యక్రమం ఘనంగా ముగిసింది.

# ఏపీకి 23 ఐఐటీల టెకాలజీ..

**చదబాబు సమక్షలో చారితక డికరేషన్! అమరావతి కేదగా కీలక ముదడుగు**




ఆధపదేశ్ అభివదికి, సాకేతిక పగతికి ఊతమిచేలా దేశలోని 23 ఐఐటీలు ముదుకొచాయి. రాషానికి అవసరమైన టెకాలజీని బదిలీ చేసేదుకు సపూర అగీకార తెలుపుతూ ముఖమతి చదబాబు సమక్షలో 'పాన్ ఐఐటీ ఏపీ 2026' సదసులో ఒక చారితక డికరేషన్‌ను విడుదల చేశాయి. అమరావతిని గోబల్ నాలెడ్, డీప్‌టెక్ హబ్‌గా మారే లక్షతో విజయవాడలో జరిగిన ఈ సదసులో తీసుకున ఈ నిరయ రాష భవిషతుకు మైలురాయిగా నిలవనుది. శనివార విజయవాడలోని డాకర్ బీఆర్ అబేదర్ కళావేదికలో జరిగిన ఈ సదసు వేదికగా ముఖమతి చదబాబు నాయుడు కీలక పకటనలు చేశారు. అమరావతిలో 'పాన్ ఐఐటీ వరల్ కౌనిల్' ఏరాటు చేసునటు, డీప్‌టెక్ సారప్‌లు, ఆవిషరణలకు ఊతమిచేలా రూ.500 కోటతో 'పాన్ ఐఐటీ అమరావతి వెచర్ ఫడ్' ఏరాటు చేసునటు పకటిచారు. పపచవాపగా ఉన 100 మది ఐఐటీయనతో ఒక గోబల్ మెటర నెట్‌వర్‌ను కూడా ఏరాటు చేసి ఏపీలోని సారప్‌లకు మారనిరేశ చేయనునటు తెలిపారు. ఈ సదసులో భాగగా కూ–శివ పేరుతో రూపొదిచిన ఐదు మినీ టెసిగ్ కాట కపూటరను సీఎ చదబాబు ఆవిషరిచారు. కూబిట్ ఫోర్, చడీగఢ్ యూనివరిటీ సహకారతో రూపొదిచిన ఈ కపూటరతో పాటు 4 కెలిన్ పాసెసర్‌ను కూడా ఆవిషరిచారు. 'మేడ్ ఇన్ అమరావతి' బాడ్‌ను సషిచేలా కాట కపూటర తయారీకి శీకార చుటడ రాషలో డీప్‌టెక్ ఉతతుల తయారీ సామరానికి నిదరనమని సీఎ అనారు. ఈ కపూటర తయారీకి అవసరమైన కాపోనెటు మచిలీపటలోనే లభిసునాయని కూబిట్ సస సీఈఓ వివరిచడ గమనార.
దేశ నిరాణలో ఐఐటీయన పాత కీలకమని, వికసిత్ భారత్, సరాధ లక్షాల సాధనకు వారి మేధసును వినియోగిచాలని చదబాబు పిలుపునిచారు. "ఇపటివరకు సిలికాన్ వాలీ గురిచి మాటాడుకునా. ఇకపై పపచ అమరావతి కాట వాలీ గురిచి మాటాడుకుటుది" అని ఆయన ధీమా వక చేశారు. వచే ఏడాది ఫిబవరి నుచి అమరావతిలో ఐబీఎ–టీసీఎస్–ఎల్అడ్‌టీ సయుకగా ఏరాటు చేసున కాట కపూటర్ ఆపరేషను పారభమవుతాయని వెలడిచారు. భవిషతులో కాట కపూటరను, వాటి పరికరాలను ఇకడే తయారు చేసి ఎగుమతి చేసే సాయికి ఏపీ ఎదగాలని ఆకాక్షిచారు.

పాన్ ఐఐటీ డికరేషన్‌లోని ముఖాశాలు

రెడు రోజుల మేధోమథన అనతర విడుదల చేసిన ఉమడి డికరేషన్‌లో పలు కీలక నిరయాలు తీసుకునారు.
పాన్ ఐఐటీ వరల్ కౌనిల్: అమరావతి కేదగా ఇది ఏరాటవుతుది. పపచవాపగా ఉన 5 లక్షల మది ఐఐటీయనను అనుసధానిసూ ఏపీ అభివదికి ఈ నెట్‌వర్ పనిచేసుది.
టెకాలజీ బదిలీ: 23 ఐఐటీలు, 25 ఇనోవేషన్ హబ్‌ల నుచి టెకాలజీలను గురిచి ఏపీలోని పరిశమలు, సారప్‌లకు అదుబాటులోకి తెసారు.
నైపుణాభివది: రాషలోని విశవిదాలయాలను పాన్ ఐఐటీ ఎకోసిసతో అనుసధానిచి పరిశోధన, నైపుణాలను బలోపేత చేసారు.
సారప్‌లకు పోతాహ: 2030 నాటికి రాషలో కనీస 50 డీప్‌టెక్ సారప్‌లను ఇకుబేట్ చేయడమే లక్షగా 100 మది ఐఐటీ మెటర నెట్‌వర్‌ను ఏరాటు చేసారు.
పెటుబడుల ఆకరణ: కాటమ్–ఏఐ, సెమీకడకరు, సేస్–డిఫెన్ వటి రగాలో పెటుబడులను ఆకరిచేదుకు పతేక డీప్‌టెక్ పాలసీ పాకేజీని అమలు చేసారు.

రెడు రోజుల పాటు జరిగిన ఈ సదసులో వివిధ ఐఐటీల డైరెకరు, సీఈఓలు, వెచర్ కాపిటలిసులు పాలొనారు. ఇధన, ఆరోగ, వవసాయ, నీటి భదత వటి పలు కీలక రగాలపై పానెల్ చరలు జరిగాయి. పతి ఏడాది పాన్ ఐఐటీ సమిట్ నిరహిచాలని సీఎ ఈ సదరగా పతిపాదిచారు.

# సుప్రీం తీర్పు తర్వాతే మున్సిపల్ ఎన్నికలు: మంత్రి నారాయణ

**– స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టుకు వెళ్లిన ఏపీ ప్రభుత్వం**

**– బీసీ రిజర్వేషన్లకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్న నారాయణ**

**– గత ప్రభుత్వం వల్లే అమరావతి అభివృద్ధి ఆగిపోయిందని విమర్శ**



స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీ) 34 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించడం తెలిసిందే. ఈ క్రమంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ స్పందించారు. అమరావతిలో ఈరోజు ఆయన మాట్లాడుతూ, బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన తర్వాతే 123 మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. రాబోయే గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని మంత్రి నారాయణ వివరించారు. ఇందుకోసం సుమారు రూ.2,000 కోట్లు కేటాయించామని, ఇందులో ఒక్క రాజమండ్రి అభివృద్ధి పనులకే రూ.1,000 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సవాలుగా ఉన్నప్పటికీ, పుష్కరాల నిర్వహణకు నిధుల కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. గతంలో జల్ జీవన్ మిషన్ కింద మంజూరైన రూ.5,350 కోట్ల నిధులు వినియోగించుకోకపోవడంతో నిలిచిపోయిన ప్రాజెక్టులను కేంద్రం సహకారంతో పునరుద్ధరిస్తామని తెలిపారు. అమరావతి అభివృద్ధి పనుల గురించి ప్రస్తావిస్తూ, ప్రపంచంలోని ఐదు ఉత్తమ రాజధానుల్లో ఒకటిగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనులు ప్రారంభమయ్యాయని అన్నారు. గత ప్రభుత్వం అమరావతి అభివృద్ధిని పూర్తిగా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో 2028 చివరి నాటికి నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. 2027లో 12 రోజుల పాటు జరగనున్న గోదావరి పుష్కరాలకు లక్షలాదిగా భక్తులు వస్తారని అంచనా వేస్తున్న నేపథ్యంలో రోడ్లు, ఘాట్లు, విద్యుత్ సరఫరా వంటి మౌలిక వసతుల పనులను వివిధ శాఖలు సమన్వయంతో చేపడుతున్నాయి.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER · తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
04,అక్టోబర్ ఆదివారం 2026

# మృణాల్ ఠాకూర్ భోజుపురికీ వెళ్తుందా?

మృణాల్ ఠాకూర్ భోజుపురికీ వెళ్తుందా?
నాటి నుంచి గ్లామర్ షోల కంటే నటనకు ప్రాధాన్యమున్న వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న భామ దక్షిణాదిలోనే గాక ఉత్తరాదిలోనూ వరుస అవకాశాలతో దూసుకుపోతోంది మృణాల్ ఠాకూర్ అంటే -సీతారామం- చిత్రంలోని సీత పాత్రే కళ్ల ముందుకొస్తుంది. నాటి నుంచి గ్లామర్ షోల కంటే నటనకు ప్రాధాన్యమున్న వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న భామ దక్షిణాదిలోనే గాక ఉత్తరాదిలోనూ వరుస అవకాశాలతో దూసుకుపోతోంది. ఈ క్రమంలోనే మృణాల్ ఠాకూర్ త్వరలోనే భోజ్‌పురి చిత్రపరిశ్రమలోకి ఎంట్రీ ఇవ్వబోతోందంటూ నెట్టింట ఓ వార్త హల్‌చల్ చేస్తోంది. భోజ్‌పురి నటుడు, లోక్‌సభ సభ్యుడు అయిన రవికిషన్‌తో కలిసి మృణాల్ ఓ ప్రాజెక్ట్ కమిట్ అయిందనేది ఆ వార్తల సారాంశం. ఇప్పటికే ఇద్దరు బాలీవుడ్ చిత్రాలైన -బట్లా హౌస్-, -సన్ ఆఫ్ సర్దార్ 2- లలో ముఖ్య పాత్రలలో కలిసి నటించారు. ఆ పరిచయంతోనే ఓ బలమైన భోజ్‌పురి కథకు మృణాల్ అయితేనే సరిగ్గా సరిపోతుందని భావించి రవికిషన్ ఆఫర్ చేశారని.. దానికి ఆమె కూడా సుముఖత వ్యక్తం చేసిందనే ప్రచారం సినీ వర్గాల్లో ఊపందుకుంది.సినిమాల ఎంపిక విషయానికి వస్తే మృణాల్ సిద్ధాంతాలు చాలా స్పష్టం. కోట్ల పారితోషికాలు ఆఫర్ చేసినా? గ్లామర్ బొమ్మగా మిగిలిపోయే పాత్రలను అమ్మడు ఏనాడూ అంగీకరించలేదు. పారితోషికం తక్కువ అయినా? నటనకు ఆస్కారం ఉండి ప్రేక్షకుల గుర్తుండిపోయే పాత్రలకే అమ్మడు ప్రాధాన్యత ఇస్తుంటారు. -సీతారామం- తర్వాత అనేక కమర్షియల్ అవకాశాలు తలుపు తట్టినా? స్క్రిప్ట్ సెలెక్షన్ విషయంలో రాజీ పడకుండా కాన్సెప్ట్ ఆధారిత చిత్రాలనే ఎంచుకుంటూ వస్తున్నారు. ఇప్పటికే హిందీ, మరాఠీ, తెలుగు వంటి విభిన్న భాషల్లో నటనతో పదునైన ముద్ర వేసిన మృణాల్ ఇప్పుడు భోజ్‌పురి ప్రాంతీయ సినిమా వైపు దృష్టి పెట్టడం వెనుక బలమైన కథే ఉంటుందని ఇండస్ట్రీ విశ్లేషకులు భావిస్తున్నారు. సాధారణంగా భోజ్‌పురి సినిమాలంటే మాస్, గ్లామర్ కంటెంట్‌కే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుంటారనే టాక్ ఉంది. కానీ మృణాల్ లాంటి సహజ నటి అక్కడ అడుగుపెడుతోందంటే? ఖచ్చితంగా అదొక డిఫరెంట్ పవర్ ఫుల్ కాన్సెప్ట్ అయ్యే అవకాశం ఉంటుందనే నమ్మకం వ్యక్తమవుతోంది. అయితే దీనిపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. మృణాల్ ఠాకూర్ కానీ, రవికిషన్ టీమ్ కానీ ఈ వార్తలను ధ్రువీకరించాల్సి ఉంది. ఇవన్నీ రూమర్లా లేక నిజంగానే క్రేజీ ప్రాజెక్ట్ సిద్ధమవుతోందా? అనేది తెలియాలంటే మరికొన్ని రోజులు వేచి చూడాలి. ఒకవేళ ఈ కాంబినేషన్ నిజమైతే మాత్రం భోజ్‌పురి సినీ రంగానికి ఓ సరికొత్త గ్లామర్ అండ్ కంటెంట్



ల్యాండ్‌మార్క్‌గా మారే అవకాశం ఉంది.

# ధనుష్, మమ్ముట్టి 'ఓం'.. కొత్త రిలీజ్ డేట్ ఇదే!




తమిళ స్టార్ హీరో ధనుష్, మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి ప్రధాన పాత్రలలో నటిస్తున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఓం'. దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి తెరకెక్కిస్తున్న ఈ సినిమా విడుదల తేదీని నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రాన్ని ఈ ఏడాది నవంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు శుక్రవారం వెల్లడించారు.ఈ సినిమాను ధనుష్ సొంత నిర్మాణ సంస్థ వండర్‌బార్ ఫిల్మ్స్ నిర్మిస్తోంది. "నిర్ణయాత్మకమైన దాడికి రోజు వచ్చేసింది. 'ఓం' 2026 నవంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలవుతోంది" అని సోషల్ మీడియా వేదికగా చిత్రబృందం ప్రకటించింది. తొలుత ఈ చిత్రాన్ని అక్టోబర్ 16న విడుదల చేయాలని భావించారు. అయితే, సూపర్‌స్టార్ రజనీకాంత్ నటిస్తున్న 'జైలర్ 2' అక్టోబర్ 15న విడుదల కానున్న నేపథ్యంలో, ఆ సినిమాకు గౌరవం ఇస్తూ తమ చిత్రాన్ని వాయిదా వేస్తున్నట్లు ధనుష్ స్వయంగా ప్రకటించారు. సూర్య సినిమా కారణంగా దీపావళికి కూడా పోటీ పడటం లేదని ఆయన స్పష్టం చేశారు. చెప్పినట్టుగానే తాజాగా కొత్త విడుదల తేదీని ప్రకటించారు.ధనుష్, మమ్ముట్టి తొలిసారి కలిసి నటిస్తుండటంతో ఈ సినిమాపై సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో మమ్ముట్టి 'కార్తికేయన్' అనే శక్తివంతమైన పాత్రలో కనిపించనున్నట్లు దర్శకుడు గతంలోనే తెలిపారు. ఎర్రచందనం స్మగ్లింగ్ నేపథ్యంలో ఈ సినిమా కథ సాగుతుందని టైటిల్ టీజర్ స్పష్టం చేసింది. అక్రమంగా ఎర్రచందనం నరికే కార్మికుడిగా ధనుష్ నటిస్తుండగా, ఇతర కార్మికులను ధనుష్ పోలీసుల నుంచి కాపాడే సన్నివేశాలు టీజర్‌లో ఆసక్తిని రేకెత్తించాయి.ధనుష్ కెరీర్‌లోనే ఇది అత్యంత భారీ బడ్జెట్ చిత్రాలలో ఒకటిగా నిలుస్తుందని, ఇందులో అభిమానులు ఎప్పటినుంచో చూడాలనుకుంటున్న వింటేజ్ మాస్ ధనుష్‌ను చూస్తారని చిత్రవర్గాలు తెలిపాయి. ఇటీవలే మలేషియాలో ఈ సినిమా షూటింగ్ జరుపుకుంది. ఈ చిత్రంలో నసీరుద్దీన్ షా కూడా ఒక ముఖ్య పాత్ర పోషిస్తుండగా, సాయి పల్లవి, శ్రీలీల హీరోయిన్లుగా నటిస్తున్నారు. 'ఓం – చాప్టర్ 1' అనే ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ సినిమాకు సీక్వెల్ కూడా ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ చిత్రానికి సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్నారు.

# టాక్సిక్ బ్యూటీ క్లాసీ రాజస్థానీ వైబ్స్ వైరల్



బాలీవుడ్ బ్యూటీ తారా సుతారియా ఫ్యాషన్ సెన్స్ ఎప్పుడూ యూత్‌ను, ఫ్యాషన్ ప్రియులను విపరీతంగా ఆకట్టుకుంటూనే ఉంటుంది. తాజాగా ఈ బ్యూటీ రాజస్థానీ వైబ్స్‌ను క్రియేట్ చేసే కొత్త లుక్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. రాజస్థానీ క్లాసిక్ లుక్‌కు తారా మాత్రమే సరిగ్గా సరిపోతుందనేలా ఈ ఫోటోషూట్‌లో అద్భుతంగా కనిపిస్తోంది. ట్రెడిషనల్ – కంటెంపరరీ స్టైలింగ్‌ను మిళితం చేస్తూ తారా ఇచ్చిన ఈ పోజులు నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. అంతర్జాతీయ డిజైన్ లేబుల్స్.. ప్రముఖ బ్రాండ్స్ అయిన -హోలిచిక్ బై మేఘా-, -ఫ్యాషనేట్లీ పెర్నియా- సహకారంతో రూపొందిన ఈ లుక్‌లో తారా అచ్చం రాజస్థానీ రాకుమారిలా మెరిసిపోయారు. ఫ్యాషన్ ప్రపంచంలో ఈ బ్యూటీ ప్రదర్శించే గ్రేస్, ఎలిగెన్స్ ఎప్పుడూ ప్రత్యేకంగా నిలుస్తాయి. ఈ తాజా ఫోటోషూట్‌కు అభిమానుల నుండి, ప్రముఖ డిజైనర్ల నుండి ప్రశంసల వర్షం కురుస్తోంది. ఇంటర్నెట్‌లో ఈ ఫోటోలు షేర్ అవుతూ ప్రస్తుతం ట్రెండింగ్‌లో నిలిచాయి. కేవలం తన అందం – ఫ్యాషన్‌తోనే కాకుండా తారా సుతారియా తన ఆలోచనా విధానం, లైఫ్ స్టైల్ -వ్యక్తిగత విషయాల ద్వారా కూడా తరచూ వార్తల్లో నిలుస్తున్నారు. ఇటీవల పెర్నియా ఖురేషితో జరిగిన ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆమె మర్యాదలు .. జీవన శైలి గురించి ఎన్నో ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. తన తల్లి ఒక ఎటికెట్ కోచ్ కావడంతో చిన్నతనం నుంచే తన నేర్పిన జీవన విలువలను తారా ఎంతో స్పష్టంగా వివరించారు. మర్యాదలు అనగా కేవలం కొన్ని కఠినమైన నియమాలను గుడ్డిగా పాటించడం కాదని.. ఎదుటివారిపై ఆలోచనాత్మకంగా ప్రవర్తించడమే అసలైన మర్యాద అని తారా ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఇతరుల ఎదురుగా కూర్చునేటప్పుడు పాదాలు మరొకరి వైపు చూసేలా లేదా వారిని తాకేలా ఉండకూడదని.. భోజన సమయాల్లో మోచేతులను డైనింగ్ టేబుల్‌పై ఉంచకూడదని కొన్ని సున్నితమైన విషయాలను గుర్తుచేశారు. అలాగే ఎవరైనా మాట్లాడుతున్నప్పుడు వారి కళ్లలోకి చూస్తూ మాట్లాడటం వల్ల మనం వారిపై చూపుతున్న శ్రద్ధ తెలుస్తుందనిపేర్కొన్నారు. ఒకరిని పలకరించేటప్పుడు స్పర్శ సున్నితంగా ఉండటంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబించేలా ఉండాలని వివరించారు. ఈ విధంగా ఫ్యాషన్ ట్రెండ్స్‌లో అగ్రస్థానంలో ఉంటూనే.. మరోవైపు సంస్కృతి, మంచి అలవాట్లపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండటం వల్ల తారా సుతారియా యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

# అతడి నిమజ్జనం ఇంకా మిగిలే ఉంది: ప్రకాశ్ రాజ్



ప్రముఖ నటుడు, సామాజిక కార్యకర్త ప్రకాశ్ రాజ్ మరోసారి తనదైన శైలిలో వ్యాఖ్యలు చేశారు. దేశంలో గణేశుడి నిమజ్జనం పూర్తయిందని, కానీ జ్ఞానూ నిమజ్జనం ఇంకా మిగిలే ఉందని సీఈసీని ఉద్దేశించి పరోక్ష వ్యాఖ్యలు చేశారు. గాంధీ జయంతి సందర్భంగా సోషల్ మీడియాలో విడుదల చేసిన ఒక వీడియో సందేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ఎన్నికల జాబితాల ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జరుగుతున్న నిరసనలకు ఆయన మద్దతు పలికారు. కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ, కాక్రోచ్ జనతా పార్టీ వంటివి ఢిల్లీ, ముంబైలలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టాయని.. ఈ శాంతియుత నిరసనల్లో ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని, సీఈసీ వైదొలిగే వరకు పోరాడాలని ప్రకాశ్ రాజ్ పిలుపునిచ్చారు.ఓటర్ల జాబితా నుంచి పెద్ద సంఖ్యలో పేర్లను అక్రమంగా తొలగిస్తున్నారని నిరసనకారులు ఆరోపిస్తున్నారు. ఈ సవరణ ప్రక్రియ విషయంలో మిగతా ఇద్దరు ఎన్నికల కమిషనర్లు కూడా పలుమార్లు అభ్యంతరాలు తెలిపినట్లు వార్తలు రావడం ఈ వివాదాన్ని మరింత తీవ్రతరం చేసింది. ఈ ఆందోళనల నేపథ్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద 700 మందికి పైగా నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముంబైలోనూ భారీగా పోలీసులు మోహరించారు.

# తెలుగులోకి 'హనుమాన్ అంశ్'.. రిలీజ్ డేట్ వచ్చేసింది!

ఆధ్యాత్మిక కథాంశంతో తెరకెక్కిన 'హనుమాన్ అంశ్' సినిమా బాక్సాఫీస్ దగ్గర భారీ వసూళ్లు సాధిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే రూ.400 కోట్ల మార్క్‌ను దాటిన ఈ సినిమా.. ఎట్టకేలకు తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. అక్టోబర్ 9న ప్రపంచవ్యాప్తంగా తెలుగు వెర్షన్‌ను విడుదల చేయనున్నట్లు హోంబలే ఫిల్మ్స్ ప్రకటించింది.నిజానికి ఈ సినిమా తెలుగు వెర్షన్ సెప్టెంబర్ 18న విడుదల కావాల్సి ఉంది. దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్‌కు చెందిన ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ తెలుగు వెర్షన్‌ను సమర్పించనున్నట్లు తొలుత ప్రచారం జరిగింది. అయితే డీల్ కుదరకపోవడంతో త్రివిక్రమ్ ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నట్లు సమాచారం.సెప్టెంబర్ 15న హైదరాబాద్‌లో తెలుగు టీజర్‌ను విడుదల చేసేందుకు ఏర్పాట్లు కూడా చేశారు. అయితే చివరి నిమిషంలో ఆ కార్యక్రమం రద్దయింది. ఇప్పుడు హోంబలే ఫిల్మ్స్ స్వయంగా తెలుగు విడుదల బాధ్యతలను తీసుకుంది.కేవలం రూ.1.8 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కినట్లు చెబుతున్న ఈ సినిమా.. సెప్టెంబర్ 28 నాటికి భారత్‌లో రూ.300 కోట్లకు పైగా నెట్ వసూళ్లు సాధించింది. 52వ రోజుకు ఈ మార్క్‌ను అందుకుంది. ప్రపంచవ్యాప్తంగా రూ.400 కోట్లకు పైగా వసూళ్లు రావడంతో చిత్రబృందం ఆనందం వ్యక్తం చేస్తోంది.విశాల్ చతుర్వేది దర్శకత్వం వహించిన ఈ సినిమా.. నీమ్ కరోలి బాబా జీవిత ప్రేరణతో తెరకెక్కిన ఆధ్యాత్మిక కథ. లక్ష్మీ నారాయణ్ అనే వ్యక్తి ఆధ్యాత్మిక మార్గంలోకి వెళ్లి ప్రముఖ సాధువుగా ఎలా మారాడన్నదే కథ.




నీమ్ కరోలి బాబా పాత్రలో శోభినవ్ సత్యా నటించారు. విహాన్ షెదెగే, పూర్ణిమ తివారీతో పాటు పలువురు కీలక పాత్రల్లో కనిపించారు.

# 'నా వైఫ్ మిస్సింగ్'..

## చాలాకాలం తర్వాత మళ్లీ జోడీగా వరుణ్ సందేశ్, శ్వేతా బసు




'కొత్త బంగారు లోకం' చిత్రంతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న వరుణ్ సందేశ్, శ్వేతా బసు ప్రసాద్ జంట చాలా కాలం తర్వాత మళ్లీ తెరపైకి రాబోతోంది. వీరిద్దరూ ప్రధాన పాత్రల్లో 'ఆహా' ఓటీటీ సమర్పిస్తున్న సరికొత్త ఒరిజినల్ సిరీస్ 'నా వైఫ్ మిస్సింగ్'. వినూత్నమైన కంటెంట్‌తో సబ్‌స్క్రైబర్లను నిరంతరం ఆకట్టుకుంటున్న ఆహా, ఈ సస్పెన్స్ థ్రిల్లర్‌తో మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది.
భార్య కనపడటం లేదంటూ ఒక భర్త పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఈ కథ మొదలవుతుంది. ఈ కేసులో నిజమేంటి అనే అంశం చుట్టూ కథనం సాగుతుందని తెలుస్తోంది. ఇటీవల ఆహా విడుదల చేసిన అప్‌డేట్‌లో "ప్రతి కేసుకు ఒక కథ ఉంటుంది, ఈ కేస్ లో నిజం ఏంటి?" అనే క్యాప్షన్ ప్రేక్షకులలో క్యూరియాసిటీని మరింత పెంచింది. తన భార్య మిస్సయ్యిందంటూ వరుణ్ సందేశ్ కంప్లైంట్ ఇవ్వడం, దాని వెనుక ఉన్న రహస్యం ఏమిటనేది సిరీస్‌లో ఉత్కంఠభరితంగా చూపించనున్నారని సమాచారం.వరుణ్ సందేశ్, శ్వేతా బసు ప్రసాద్‌లది టాలీవుడ్‌లో ఒక సక్సెస్‌ఫుల్ పెయిర్. 'కొత్త బంగారు లోకం' తర్వాత వీరిద్దరూ కలిసి నటిస్తున్న ప్రాజెక్ట్ ఇదే కావడంతో సిరీస్‌పై అంచనాలు సహజంగానే పెరిగాయి. చాలా ఏళ్ల తర్వాత ఈ జంట మళ్లీ కలిసి నటించడం ఈ ప్రాజెక్ట్‌కు ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది.
ఈ సిరీస్‌ను తెలుగుతో పాటు తమిళ భాషల్లో కూడా ఒకేసారి అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆహా ప్రకటించింది. మిస్సింగ్ కేసు వెనుక ఉన్న మిస్టరీ ఏంటి? నిజంగానే శ్వేతా బసు పాత్ర అదృశ్యమైందా? లేక దీని వెనుక ఇంకేదైనా కుట్ర ఉందా? అనే ప్రశ్నలకు సమాధానం తెలియాలంటే సిరీస్ చూడాల్సిందే. త్వరలోనే 'నా వైఫ్ మిస్సింగ్' స్ట్రీమింగ్ తేదీని అధికారికంగా ప్రకటిస్తామని ఆహా టీమ్ తెలిపింది.

## 'రణబాలి' పాత్ర వెనుక ముగ్గురు రాయలసీమ వీరులు..

# డైరెక్టర్ రాహుల్ ఆసక్తికర విషయాలు!

విజయ్ దేవరకొండ, రష్మిక జంటగా నటిస్తున్న పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'రణబాలి'పై ఆసక్తి పెరుగుతోంది. బ్రిటిషర్లకు వ్యతిరేకంగా పోరాడిన సింగనమల బొబ్బిలి రణబాలి అనే యోధుడి పాత్రలో విజయ్ కనిపించనున్నారు. దసరా కానుకగా అక్టోబరు 16న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో సినిమా మేకింగ్‌కు సంబంధించిన ఆసక్తికర విషయాలను చిత్ర బృందం వెల్లడిస్తోంది.'రణబాలి' పాత్రను రాయలసీమకు చెందిన ముగ్గురు పాలెగాళ్ల వీరోచిత గాథల నుంచి స్ఫూర్తి పొంది తీర్చిదిద్దినట్లు దర్శకుడు రాహుల్ సాంకృత్యన్ తెలిపారు. బుడ్డా వెంగళ్‌రెడ్డి, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, గడేకల్ బొబ్బిలి నాగిరెడ్డి జీవితాలు ఇందులో కీలకంగా నిలిచాయని చెప్పారు.ఈ ముగ్గురు వీరుల కథలు ఇప్పటికీ రాయలసీమలో పాటల రూపంలో ప్రచారంలో ఉన్నాయని రాహుల్ తెలిపారు. వారి జీవితాల్లోని వీరోచిత ఘటనలు, ప్రజల్లో ప్రచారంలో ఉన్న కథనాల నుంచి అంశాలను తీసుకుని 'రణబాలి' పాత్రను రూపొందించినట్లు వివరించారు. దీంతో విజయ్ పోషిస్తున్న పాత్ర వెనుక రాయలసీమ చరిత్ర, జానపద గాథల ప్రభావం ఉన్నట్లు తెలుస్తోంది.బ్రిటిషర్లకు వ్యతిరేకంగా పోరాడే యోధుడిగా విజయ్ దేవరకొండను ఈ సినిమాలో



చూపించనున్నారు. రష్మిక కథానాయికగా నటిస్తోంది. పీరియాడికల్ నేపథ్యంతో తెరకెక్కిన ఈ యాక్షన్ డ్రామాను దసరా సందర్భంగా అక్టోబరు 16న థియేటర్లలో విడుదల చేయనున్నారు.